9

# శ్రీ శేషదేవులు నీతిపరుడైన తండ్రికి ఆత్మసేవ చేసినారు

శ్రీ శేషబాబుగారి తండ్రిగారైన శ్రీ భైరవస్వామి గారు అగ్రికల్చర్ డిపార్టుమెంటులో అక్కౌంటెంటుగా నిజాయితీగా పని చేసేవారు. ఆ రోజులలో ఆ డిపార్టుమెంటులో పనిచేసేవారు లంచముల ద్వారా బాగా సంపాదించేవారు. కానీ ఈయన అక్కౌంటెంటుగా తనకు వాటా వచ్చినా గానీ దాన్ని తీసుకొనేవారు కాదు. రైతులకు ఎరువు బస్తాలు, విత్తనాలు అమ్మడంలో రైతులు వీరికి మామూళ్ళు ఇవ్వాలనుకుంటే ఆయన ఏమాత్రము తీసుకునేవారు కాదు. అణా పైసలతో సహా వారికి తిరిగి ఇచ్చేసేవారు.

ఎవరైనా ఆయనను ఏమి చేస్తున్నారు అని అడిగితే, ఆయన అక్కౌంటెంటు అయి ఉండి కూడా అలా చెప్పకుండా గవర్నమెంటు నౌకరీ చేస్తున్నాను అనేవారు. ఆ విధముగా ఆయన చాలా నిరాడంబరముగా మాట్లాడేవారు, నిరాడంబరముగా జీవించేవారు.

శ్రీ భైరవస్వామి గారు 1952 సమయములో కాకినాడలో ఉద్యోగము చేసెడివారు. కాకినాడలో ఆయనకు సహోద్యోగులుగా ఒక సిక్కుమతస్థుడగు శ్రీ సింగు గారితోను, ఒక ముస్లిం మతస్థునితోను సన్నిహితముగా స్నేహము చేసెడివారు. ఆయన అన్ని మతభావములను గౌరవించెడివారు. ఆయన జీవితకాలమంతా ప్రతిరోజు ఉదయం భగవంతుడిని పూజించి భగవద్గీత, ఖురాను గ్రంథములను చదివిన తరువాతనే రోజు వారీ పనులు ప్రారంభించేవారు. ఆయన మత సాంప్రదాయములను తప్పకుండా పాటించేవారు గానీ, సంకుచిత భావాలను కలిగియుండకుండా అన్ని మతములను సమానముగా గౌరవిస్తూ మతరహితముగా విశాలమైన భక్తిభావములు కలిగి ఉండేవారు.

continue...

శ్రీ భైరవస్వామి గారు నీతి విషయములో ఏ మాత్రము రాజీ పడేవారు కాదు. నీతి విషయములో కుటుంబ సభ్యులనైనా పట్టించుకోనంత ఖచ్చితముగా ఉండేవారు. అవినీతి మార్గములో ధనమును సంపాదించమని బంధువులు, సహోద్యోగులు ఎంతగా నచ్చచెప్పినాగానీ ఆయన ఏ మాత్రము ఆలకించేవారు కాదు. ప్రాణము పోయినాగానీ నమ్మిన నీతిని విడువని మొండివానిగ ఆయన స్నేహితులు ఆయనను భావించెడివారు.

శ్రీ భైరవస్వామి గారిని ఎరిగిన ప్రతి ఒక్కరు ఆయనను నీతిపరునిగ, గొప్పవానిగ అభిమానించేవారు, గౌరవించేవారు.

జన్మతః సద్గురుమూర్తియగు శ్రీ శేషుబాబుగారు తన జీవితములో తనకు తారసపడిన ప్రతి వ్యక్తిలోని దుస్సంస్కారములను తాను స్వీకరించి, ఎల్లరకు ఆత్మాభివృద్ధిని కలిగించే సేవను చేసినారు. శ్రీ భైరవస్వామి గారి విషయములో కూడా శ్రీ శేషుబాబు గారు సత్యమును తెలియచేస్తూ, ఆత్మసేవనే అనుగ్రహించినారు. లోకములో అందరిచేత నిజాయితీ పరునిగ కీర్తించబడే శ్రీ భైరవస్వామి గారితో ఒకసారి మాట్లాడుతూ శ్రీ శేషుబాబు గారు ఇలా అన్నారు. "నాన్నగారూ, మీరు నీతి కొరకై ఉద్యోగములో లంచాలు తీసుకోకుండా జీవించినారని అందరూ అనుకుంటున్నారు. నేను మాత్రము అది మీ పిరికితనమని అనుకుంటున్నాను. చట్ట విరుద్ధముగా లంచము తీసుకుంటే ప్రమాదము అనే భయముతోనే మీరు లంచాలు తీసుకోలేదని, అది మీ పిరికితనమేనని నాకనిపించుచున్నది" అని అన్నారు. ఆ మాటలకు శ్రీ భైరవస్వామి గారు ఆశ్చర్యపోయారు. కొంత సేపు సుదీర్ఘముగా ఆలోచించి "శేషూ నీవు చెప్పినది నిజమేనని ఒప్పుకుంటున్నాను" అని చెప్పినారు. లోకములోని పిల్లలందరూ తమ తండ్రి అవినీతిపరుడైనా గానీ సమర్థించుకుంటూ, అభిమానిస్తూ ఉంటారు. కానీ శ్రీ శేషుబాబు గారు ఆత్మవిమర్శతో తనలోని అణువణువునూ విమర్శించుకున్నట్లే, తన బంధములలోని మాయను కూడా ఆత్మవిమర్శ ద్వారా కడిగేసేవారు. నీతిపరుడైన తన తండ్రి విషయములో లోకపద్ధతిలో అభిమానానికి లోబడకుండా ఆత్మవిమర్శనే తండ్రికి పంచి ఇచ్చినారు. శ్రీ శేషుబాబు గారిలోని అట్టి ఆత్మవిమర్శ శక్తియే శ్రీ భైరవస్వామి

continue...

గారిలో ప్రవేశించి తన జీవిత కాలములో ఎన్నడూ విననట్టి కఠిన విమర్శను కూడా సంతోషంగా స్వీకరించేలా చేసింది. నీతిపరుని ఆత్మకు ఆత్మవిమర్శను నేర్పి నీతి పరిధి నుండి సత్యపరిధికి అభివృద్ధి చెందించిన ఆత్మాభివృద్ధి ప్రదాత శ్రీ శేషుబాబు గారు.

శ్రీ శేషుబాబు గారి చరిత్రలోని ఈ ఒక్క సంఘటన ద్వారానే మనమందరము తెలుసుకోవలసిన రెండు ముఖ్య విషయములు ఉన్నవి. ప్రతి వ్యక్తి తన విషయములోను, తనకు సంబంధించిన బంధాలు అన్నింటి విషయములోను ఆత్మవిమర్శ చేసుకొనుట ద్వారా మాయా సంబంధమైన అభిమాన ద్వేషములను తగ్గించుకుంటూ జీవించాలి. తనలోని తన కుటుంబములోని, తన బంధువులలోని, తన కులములోని, తన మతములోని తనకు సంబంధించిన వాటన్నింటిలోని గొప్పదనాన్ని చూచి గర్వించుట కాక, ఆ గొప్పదనము మాటున దాగియుండే ఆత్మసంస్కారమును ఆత్మవిమర్శ ద్వారా గుర్తించుకొనుట ద్వారా అభిమాన ద్వేషములకు అతీతముగా జీవించుటయే ఉత్తమ జీవనమవుతుంది.

ఇక రెండవ విషయము ఏమిటంటే లోకములోని ఎంతోమంది సెలబ్రిటీలుగా జీవిస్తుంటారు. రాజకీయనాయకులుగా, ఆధ్యాత్మికబోధకులుగా, విద్యాదాతలుగా నీతిమంతులుగా, విజ్ఞానవేత్తలుగా, కళాకారులుగా ప్రజోపయోగ కార్యాలతో ఉత్తములుగ కీర్తించబడుచూ ఉంటారు. అట్టి వారికి స్వయముగా వారిలో అహంకారము లేకపోయినాగానీ లోకమంతా వారిని అయాచితముగానే గొప్పవారిగా కీర్తించేస్తూ ఉంటుంది. వారు ఆ కీర్తి మత్తుకు లోబడకుండా ఆత్మవిమర్శ చేసుకోవాలి. ప్రేమస్వరూపుడైన భగవంతుడు దుఃఖభూయిష్టజీవులైన మానవజాతిని ప్రత్యేకముగా ప్రేమించి, మానవజాతికి సేవ చేయుటకై దేవతలను అనుగ్రహించినారు. నిరాకారమందున్న దేవతాశక్తులే మానవులకు అనుక్షణమూ సేవ చేయుచూ రక్షించుచున్నారు. సహజముగా మనిషి నుండి ఉద్భవించేవి అసూయ, ద్వేషము, అహంకారము, కోపము, దుర్భాషలు వంటి దుర్గుణములు మాత్రమే అయివున్నవి. ఏ వ్యక్తియైనా ప్రజాసేవ, నీతికర్మ, ధర్మకర్మ, సత్యకర్మ ఆచరించుచున్నారంటే, ఆ కర్మను ఆ వ్యక్తిలో ప్రవేశించి దేవతా శక్తులే ఆచరించుచున్నారని అర్థమైయున్నది. అట్టి కీర్తికి తాము అర్హులము కామని, తమయందుండి అట్టి కర్మలు దేవతలే చేయుచున్నారని, అట్టి కర్మలతో తమకు సంబంధములేదని ప్రతివ్యక్తి గ్రహించుకోవాలి. తమయందుండి దేవతలు సత్కర్మలు చేయుచున్నా గానీ అప్పుడప్పుడు తమలో కలుగుచున్న తద్విరుద్ధమైన తలంపులే తమ నిజస్థితియని ఆత్మవిమర్శ ద్వారా గ్రహించుకొనవలెను. తద్వారా కీర్తి

continue...

మత్తు బంధనాలలో ఆత్మ చిక్కుకొనక ఆత్మాభివృద్ధిని సాధించుకోవచ్చును. ఇట్టి ఆత్మవిమర్శయే భక్తి సాధనము, పూజా విధానమును అయి ఉన్నది. ఇట్టి సాధన ఫలమును శ్రీ శేషుబాబు గారు తమ ఆత్మశక్తితో శ్రీ భైరవస్వామి గారికి అనుగ్రహించినారు.

శ్రీ భైరవస్వామి గారు ఆరోగ్యముగా జీవించి, 1986వ సంవత్సరములో సహజ మరణమును పొందినారు. సద్గురు శ్రీ శేషుబాబు గారు 22-11-1998వ తేదీన అవతారునిగా మేల్కొనిన పిదప నిరాకారమందున్న అనేక ఆత్మలు విశ్రాంతి కొరకు, విముక్తి కొరకు శ్రీ గురుదేవుల వద్దకు వచ్చి విలపించుచుండేవి. అటువంటి సమయములో శ్రీ భైరవస్వామి గారు కూడా ఆత్మరూపములో విముక్తి కొరకై శ్రీ గురుదేవుల వద్దకు వచ్చేవారు. శ్రీ భైరవస్వామి గారికి బాహ్యబంధములపై ఉన్న మమకారము వీడకపోవుట చేతనే ఆ బంధనాలచేత ఆత్మ బందీయై ముందుకు వెళ్ళ లేకపోయినారని గ్రహించిన శ్రీ గురుదేవులు తమ ఆత్మశక్తితో మమకార బంధనాల నుండి విముక్తిని కలిగించినారు. కొద్ది రోజులలోనే ఆయన మరల మరోక దేహములో జన్మించెదరని శ్రీ గురుదేవులు చెప్పియున్నారు. శ్రీ శేషుబాబు గారు ఒకసారి ఒక సత్యవాక్యాన్ని ఇలా చెప్పియున్నారు. "దేహమునకు ఐశ్వర్యము, ఆరోగ్యము, ఆయుష్షు వంటి స్వర్గఫలాలను ప్రసాదించాలనే ఆతృత సద్గురువుకే ఉంటుంది గానీ అవతారునికి ఉండదు. అవతారుని దృష్టిలో మరణము, పుట్టుక రెండూ సమానమే. దేహముతో నా వద్ద ఉన్నవ్యక్తి ఒకవేళ మరణించినాగానీ మరల ఆత్మ రూపములో నా వద్దకే వస్తాడు, పై చొక్కా మారుతుందంతే, అందువలన మరణము వలన దూరమయ్యేదేమీ లేదు. కాబట్టి మరణాన్ని ఆపాలనే ఆతృత అవతారునికుండదు. ఆ వ్యక్తికి ఆత్మాభివృద్ధిని కలిగించాలనియే అవతారుడు ఆలోచిస్తారు". అని శ్రీ శేషుబాబు గారు చెప్పినారు. అదే విధముగా శ్రీ శేషుబాబు గారు శ్రీ భైరవస్వామి గారితో సహా అనేక ఆత్మలకు ఆత్మాభివృద్ధిని, మాయాబంధ విముక్తిని ప్రసాదించి అనుగ్రహించిన ఆత్మస్థితోద్ధారకులైయున్నారు.

